# బిచ్చగాళ్ళూ
# మధ్యతరగతి గృహిణీ

I "ఏడు కొండలవాడా! ఎంగట్రమణా! గోవిందా, గొహోవింద!"

ఆ కేక వింటూనే గుండెలదిరిపోతాయి కళ్యాణికి. "అప్పుడే మొదలయింది, వైతాళికుడొచ్చేశాడు" అనుకుంటుంది. చలికాలం తెల్లవారు జాము. తలుపు తెరవాలంటే భయం, చలి వణికించేస్తుంది. తెరవకుండా వుందామంటేనా, వచ్చినవాడు వడ్డికాసుల వాడి భక్తుడు! ఏ మాత్రం కనికరముండదు. అట్లా ఎంతసేపైనా అరుస్తూనే వుంటాడు, ఠంగ్, ఠంగ్ మంటూ గంటకొడుతూనే వుంటాడు. దుప్పటిబిగించి గుర్రుపెడుతున్న గృహస్తుడు, నిద్రాభంగమైనందుకు విసుక్కుంటాడు. నిజానికి ఆ విసుగుదల వీధిలో 'వాడి' మీద కంటే, ఇంట్లో 'దాని' మీదే ఎక్కువ! తప్పనిసరిగా లేచివెళ్ళి, ఆ వెంకటేశ్వర భక్తుని సత్కరించవలసిందే. అట్లా దైనందిన నాటకానికి నాంది పలికి నిష్క్రమిస్తాడు ఆ నందిలాంటి భక్తుడు.

II "కాళ్ళు కండ్లూ లేవు నారాయణా!

కబోది పచ్చులం నారాయణా!

సేయెత్తి దానాలు నారాయణా!

సేసేటి తల్లులూ నారాయణా!"

ముసల్దాని చేతి కర్ర అందుకుని, గుడ్డి బిచ్చగాడి ఆర్తనాదం. కళ్యాణి అప్పుడు కాఫీ చేస్తూనో, స్నానాల ఏర్పాట్లు చేస్తూనో, టిఫిన్ చేసేహడావిడిలోనో సతమతమౌతూ వుంటుంది. వెళ్ళిరమ్మని చెప్పి లాభం లేదు. తన పాటనాపి, ఏం చెబుతున్నారో ఆ

గుడ్డివాడు వినడు. ఆ ముసలామెకు చెవుడు. రోజూ ఇదే తంతు. ఆ కాళ్ళు కండ్లూ లేని వాడి పాట కళ్యాణి కాళ్ళూ చేతులూ ఆడనీకుండా చేస్తుంది. వంట ఇంటి పద్మవ్యూహం నుంచీ బైట పడేందుకు వీల్లేక, పెద్దవాడిని కేకేసింది. రాసుకుంటున్న పెద్దబ్బాయి విసుక్కుంటూ వచ్చాడు.

"బాబూ! కొంచెం బియ్యం నూక వెయ్యమ్మా వాళ్ళకు"

"ఎక్కడున్నాయో నాకు తెలీదే...."

"అదుగో, అల్మారా పక్కనున్న ఎర్ర ప్లాస్టిక్ డబ్బాలో....."

అక్కడ రకరకాల డబ్బాలు కొలువుదీరినట్లున్నాయి. అక్కడికీ పెద్దబ్బాయి లంకలో హనుమంతుడు సీతమ్మవారి కోసం వెతికినట్లు ఎర్ర ప్లాస్టిక్ డబ్బా కోసం వెతికి పట్టుకుని, అందుకోబోయే సరికి..: ఎక్కడ వాడి కాలో చెయ్యో తగిలిందో, కళ్యాణి కట్టిన ప్లాస్టిక్ మేడలన్నీ కూలిపోయినాయి. వాటిల్లోని ఉప్పు, పప్పు, చక్కెరా, బియ్యం నూకా కలసి చెదరి ఇల్లంతా పరుచుకున్నాయి. ఆదృశ్యం చూస్తూనే కళ్యాణి కంట గిర్రున నీరు తిరిగింది.. పెద్దవాడు భయపడి పారిపోయినాడు. ఇంట్లో ఇంత గొడవ జరుగుతోన్నా, బయట పాట అంతకంతకూ ఉధృతమౌతూ ప్రవహిస్తోనేవుంది. కళ్యాణి తనని తాను తిట్టుకుంటూ, పిడికిట్లో బియ్యం నూక అందుకుని వెళ్ళి వేసివచ్చింది. పాట వరద పక్కింటిమీదికి దూకింది.

"మూర్ఛవాన్ని తల్లీ! సలికి సచ్చిపోతుండాను తల్లీ"

మళ్ళీ గుమ్మం దగ్గర పిలుపు! ఇతన్ని ఉపేక్షిస్తే చాలా ప్రమాదం. గుమ్మం ముందు మూర్ఛపోయినాడంటే భిక్షంతో పాటు, బిందెడు నీళ్ళు కుమ్మరించాలి. కుళాయిల్లో నీళ్ళు రాకపోయినా, వంతుదాకా రాకపోయినా తాగడానికి గుక్కెడు నీళ్ళు లేక ఇబ్బందిపడాలి.

"గాంధి పుట్టిన దేశమా ఇది?

నెహ్రూ కోరిన సంగమా ఇది?" సందర్భ శుద్ధి కలిగిన యువ భిక్షుకి. చేత చెంబుధరించి, నొసట విభూతి దీర్చి, తాళి బొట్టును పళ్ళెరంలో వుంచుకుని'కూతురికి పెళ్ళి చేస్తున్నాను తలో చెయ్యి వెయ్యమని' కోరే పెద్దమనిషి తరహా బిచ్చగాడు! బదరీనాథో, బ్రహ్మంగారి మఠమో వెళ్ళే భక్తురాలు! కొందరివి బదిలీలు కూడాలేని పర్మనెంటు ఉద్యోగాలైతే, కొందరివి బదిలీలున్నవి. కొన్నాళ్ళు ఎక్కడికో అంతర్ధానమై వెళ్ళి, మళ్ళీ అవతరిస్తుంటారు.

తెల్లవారింది మొదలు గృహకృత్యాల పోరు ఒకవైపు. యాచకుల బృందాల హోరు ఇంకోవైపు! నిస్సహాయ స్థితిలో యాచించే వాళ్ళమీద జాలిచూపవలసిందే. కానీ, జాలి చూపడానికీ, సహాయం చేయడానికీ పరిమితి వుంటుంది. ఉదయం నుంచీ దాదాపు మధ్యాహ్నం వరకూ ఇటూ అటూ పోరాడి అలసి పోయినా, ఓ గంట విశ్రాంతి తీసుకునేందుకు అవకాశం వుండదు. ఓ పేపరో, పత్రికో చదివే సమయం వుండదు. మధ్యాహ్నం మళ్ళీ పిల్లలూ, పిల్లల తండ్రీ స్కూళ్ళ నుంచీ, ఆఫీసు నుంచీ రావడం, వాళ్ళ భోజనాలు. పొద్దున బిచ్చం కోసమో, చద్ది అన్నం కోసమో వచ్చిన వాళ్ళు మధ్యాహ్నం తిరిగి అన్నం కోసం.... రాత్రికి మళ్ళీ! ఈ బిచ్చగాళ్ళు ఎవర్నీ కాస్త ప్రశాంతంగా బతకనివ్వరేమో! పాపం.... వాళ్ళు పట్టెడన్నం కోసం అడుక్కుంటూంటే, తను ప్రశాంతంగా వుండాలనుకోడం తప్పేమో! తప్పెలాగవుతుంది? వాళ్ళ సమస్య ప్రభుత్వం పరిష్కరించవలసినంత పెద్దది. తనవంటి మధ్య తరగతి గృహిణి ఏం చేయగలుగుతుంది? రోజూ నలుగురికి నాలుగు పిడికిళ్ళ బియ్యం వేసినా, అన్నం పెట్టినా అది తమ ఆర్థిక పరిస్థితి మీద బరువే అవుతుంది. ఈ వీధిలో వున్న వాళ్ళంతా ఎక్కువ మంది తమలాంటి వాళ్ళే. వాళ్ళంతా ఎట్లా చేస్తున్నారో! ఇట్లా ఆలోచిస్తుండగా, తను నిన్న గమనించిన ఓ సంగతి జ్ఞాపకం వచ్చింది కళ్యాణికి.

ఆ వీధి కుళాయి సుశీలా వాళ్ళ ఇంటిముందుంది. సుశీలతో తనకు స్నేహముంది, చదువుకున్నదీ, చాలా తెలివైనదీ కూడా. కొన్నేళ్ళుగా తమ స్నేహాన్ని 'బ్యాలెన్స్' తప్పకుండా కాపాడుకుంటూ రావడానికి సుశీల విచక్షణ ముఖ్యకారణం. పని వత్తిడిలో తను మంచి నీళ్ళ కోసం కుళాయి వద్దకు సమయానికి వెళ్ళలేకపోతే, సుశీల బిందెడు నీళ్ళు సర్దుతుంది. అప్పుడప్పుడూ తన వంతు పట్టి వుంచుతుంది. అవసరమైతే, కుళాయి తమ ఇంటిముందు వున్న అవకాశాన్నుపయోగించుకుని, ఇతర వంతుల వాళ్ళమీద కొద్దిపాటి అధికారాన్ని చలాయిస్తుంది. అయినా చాలా మంచిది. సమర్థురాలేననడానికి సందేహం లేదు కానీ, నిన్న.... అదెలా సాధించిందో ఆశ్చర్యంగా వుంది. నిన్న పిల్లలు స్కూళ్ళకు వెళ్ళగానే తను బిందె తీసుకుని కుళాయి దగ్గరకు వెళ్ళింది. అదృష్టవశాత్తూ నీళ్ళింకా వస్తున్నాయి. సుశీల ఇంట్లో ఏదో పని చేసుకుంటున్నట్టుంది. పలకరిద్దామా.... అనుకుని ఎందుకులే పనిచేసుకోనీ, అనుకుంది. అప్పుడే నిత్య యాచకుడొకడు సుశీల ఇంటిమీదుగా వెళ్ళి తమ ఇంటి ముందు నిల్చొని కేకేసినాడు. తను ఇంట్లో లేదనీ, కుళాయి దగ్గరుందనీ తెలిసీ అతను అట్లాగే నిల్చొనివుండి, తను వెళ్ళిన తర్వాత బిచ్చం వేయించుకుని వెళ్ళాడు. అతను సుశీల ఇంటిముందాగనేలేదని, తన ఇంటి ముందు తనులేకపోయినా వచ్చేవరకూ వుండి కదల్లేదనీ జ్ఞాపకం వచ్చేసరికి... కళ్యాణికి పెద్ద ఆశ్చర్యం కలిగింది. ఈ కిటుకేమిటో

తెలుసుకోవాలనుకుంది.

★ ★ ★

"అదా నీధర్మ సందేహం?" అంది సుశీల నవ్వుతూ.

"అవును" అంది కళ్యాణి నవ్వకుండా.

"నా దగ్గరో మంత్రం వుంది. ఆ మంత్రం పఠించి యీ అసంఖ్యాక యాచకలోకాన్ని పటాపంచలు చేసి ....."

"అబ్బ! తమాషాలు చాల్లే, చెబుదూ! నాకు తొందరపనుంది"

"ఓర్పు! ఓర్పు! విద్యాభ్యాసవిషయంలో ఓర్పు అవసరం. తొందర కూడదోయ్! ఆ మంత్రం గురించి చెప్పేటప్పుడు మాగురువు శ్రీమాన్ మామిళ్ళ కామాక్షయ్య గారిని స్మరించుకోవాలి. ఆ గురుకృప వల్లనే యాచకులదాడినుంచీ నన్ను నేను కాపాడుకో గలుగుతున్నాను".

"ఎవరా గురుబ్రహ్మ? ఏమా మంత్రం?" అనడిగింది కళ్యాణి.

"మేమింతకు ముందు (ప్రొద్దుటూర్లో) వున్నప్పుడు ఆయనని దర్శించే భాగ్యం కలిగింది. మా ఇంటి కెదురుగ్గా వుండే తన ఇంటి వసారాలో కూర్చొని ఆ అసహాయశూరుడు యీ మంత్రాన్నుపయోగించే యావత్తు యాచకసైన్యాన్ని చిత్తు చిత్తుగా ఓడించి తరిమేసేవాడు. అది చూసి ముగ్ధురాలనై వారికి ఏకలవ్యురాలినై విధ్యాభ్యాసం చేశాను...."

"నువ్వు మంత్రం గురించి చెప్పేటప్పటికి నాపప్పు మాడిపోయేట్టుంది"

"సరే.. ముందు నీ పప్పు సంగతి చూసిరా, నేను నా వంట నోకంట చూసొస్తాను"

అయిదారు నిమిషాల్లో ఇద్దరూ మళ్ళీ కలుసుకున్నారు. రెండు బిందెలూ పలకరించుకున్నాయి.

"నీ ధర్మ సందేహాన్ని తీర్చుకునే ముందు యాచకధర్మాన్ని గురించి తెలుసుకోవడం అవసరం. యాచకధర్మ మనగా నేమిటో ఒకటి రెండు వాక్యములలో వర్ణింపుము?"

"ఏ పాఠంలోనూ చదువుకోలేదే!"

"నీకు గుండుసున్నా. సరే చెబుతాను. 'పైట్టె ఇంటిని వదలొద్దు, పెట్టని ఇంటికి పోవద్దు' ఇది యాచక ధర్మం. ఇంచు మించు యాచకులందరికీ ఇది తెలిసేవుంటుంది. మొదటిరకం ఇంట్లో నువ్వుండగా, రెండోరకం ఇంట్లో నేనుంటున్నాను. నీ కష్టాలకీ, నాసుఖాలకీ అదీ కారణం"

"మీ గురువుగార్ని చూసి నేర్చుకున్నది అడుక్కునే వాళ్ళకేమీ పెట్టకపోవడం. అంతేనా?"

"అంతేనా అంటే, అంతే ననుకో. అంతే అయితే మటుకు అందులో వున్న ప్రతిభనూ, ప్రాపంచిక దృక్పథాన్నీ గమనించకపోతే ఎట్లా?"

"సరే... గమనిస్తాను చెప్పు"

"శ్రీమాన్ కామాక్షయ్య గారు మునిసిపల్ హైస్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేసి అప్పటికి రిటైరయ్యారు. ఈ దిక్కుమాలిన బిచ్చగాళ్ళతో దిక్కుతోచని నాకు ఆయన మార్గం విముక్తి మార్గంగా తోచింది. చాలా రోజులు ఆయన్ని గమనించాను. ఆయన మంత్రానికి మూడే బీజాక్షరాలు, కాదంటే బీజ వాక్యాలు. 'ఇంట్లో పనిమీద వున్నారు. అట్లా వెళ్ళిరా!" ఉదయం పూటంతా ఇదే వాక్యం. అట్లా వెళ్ళి వచ్చినా, ఇట్లా వెళ్ళి వచ్చినా అదే మాట! 'వెళ్ళ'మనడం కాదు, 'వెళ్ళిరా' అనడమే అందులో వున్న లౌక్యం. గోడమీద 'రేపు' వున్నట్టు, ఎన్ని సార్లు వెళ్ళి వచ్చినా ఆ 'వెళ్ళిరా' అట్లాగే వుంటుంది. ఇక భోజనాల వేళ పఠించే మంత్రమైతే, ప్రయోగం, ఉపసంహారం మాదిరి... 'ఇంకా భోజనాలు కాలేదు' 'ఇప్పుడే భోజనాలయ్యాయి' ఇదీ...."

"అంటే?"

"వీటి గురించి వివరించాలి. ఏకవాక్యాలే గానీ ఎంతో అర్థమున్నవి. ఈ మండిపోయ్యే కాలంలో, ఈ దిక్కుమాలిన బతుకుల్లో ఇంట్లో అన్ని కడుపులకీ బొటాబొటిగా సరిపడేట్టు అన్నం వండుకోగలగడమే గగనం కదా, అటువంటప్పుడు, ఏదో చాకిరీ చేసి వచ్చేవాళ్ళకు పెట్టక ముందే, ఏ గోడలకిందో పడుకునుండి వచ్చే మీలాంటి వాళ్ళకు పెట్టలేం కదా, ఆనక మీ అదృష్టవశాత్తో, మా పుణ్యావశాత్తో మిగిలితే మీకు పెట్టకుండా వుండం కదా.... ఇటువంటి అర్థం వచ్చేట్టు చెప్పాలి.

ఇక రెండోది....

'ఇప్పుడే భోజనాలయ్యాయి (అయ్యో!)'

ఇందులో కూడా..... ఈ మండి పొయ్యే కాలంలో, ఈ దిక్కుమాలిన బతుకుల్లో ఇంట్లో అన్ని కడుపులకీ బొటా బొటిగా సరిపడేట్టు అన్నం వండుకోగలగడమే గగనం కదా... అన్నంత వరకూ మొదటి దానిలాగే పలికి, 'అటువంటప్పుడు అదనంగా మిగిలేట్టు వండుకోవడం మాతరమా?' అన్న ఓ అదనపు ప్రశ్నను వాళ్ళమీదొదల్లాలి. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడం వాళ్ళ తరమా? ఈ త్రిశరణాలను త్రికరణ శుద్ధితో వల్లిస్తూ పోతే, ఇంటి పరిసరాల్ని యాచకులు చొరరాని అబేధ్యప్రాంతంగా తయారు చేసుకోవచ్చు. అప్పుడు నువ్వు కూడా నామాదిరి యాచక దుర్నిరీక్ష్యురాలివి కావచ్చు. ఇక వస్తాను. మిగతా కథ రేపు ఇదే వీధికుళాయి వద్ద"

అంటూ పరుగెత్తింది సుశీల.

★ ★ ★

సుశీల తమాషాగా చెప్పినట్లు చెప్పినా, బిచ్చగాళ్ళ బెడద నుంచీ బయటపడాలని ఆలోచించినట్టు అర్థమవుతోంది. రాను రానూ విపరీతంగా పెరుగుతోన్నారు. ఆ మధ్య గుంటూరు నుంచీ వచ్చిన తన స్నేహితురాలు ఈ బిచ్చగాళ్ళను చూసి ఆశ్చర్యపోయింది. వాళ్ళవైపు ఇంతగా వుండరట. వెనుకబడిన ప్రాంతం లక్షణాలలో ఇదీ ఒకటేమో! ఈ బిచ్చగాళ్ళ సమస్య పై తరగతులవారికంతగా వుండదు. వాళ్ళ కాంపౌండ్లలోకి ప్రవేశించడానికే వీలుండదు. అట్లాగే కింది తరగతి వారికీ వుండదు. ఎటొచ్చీ తమవంటి వారికే వుంటుంది. సుశీల చెప్పినట్టూ చేస్తే తప్పించుకోవచ్చా? లేక తమాషాకే చెప్పిందా? తమాషా ఏముంది? సుశీలా వాళ్ళ ఇంటికి బిచ్చగాళ్ళంతగా రాకపోవడం తను చూసిందే కద! ఊరికే ప్రయోగానికన్నట్టు సుశీలాసూత్రాన్ని అమల్లో పెట్టింది కళ్యాణి. కొద్ది రోజులు కళ్యాణి మీద బిచ్చగాళ్ళకున్న నమ్మకం ఫలితాలకు ప్రతిబంధకంగా నిలిచినా, వాళ్ళలో నమ్మకం సడలిపొయ్యేకొద్దీ ఫలితాలు కనిపించడం ప్రారంభించాయి. అలవాటుగా కళ్యాణి ఇంటి ముందు కేకేసి పోవడం దగ్గర్నుంచీ, దగ్గరకే రాకుండా పోవడం వరకూ పరిస్థితి వచ్చింది. కళ్యాణి నమ్మలేకపోతోంది. తెల్లవారు జామున ఏడిపించే ఆ ఏడుకొండల వాడి ఏజెంట్ కూడా రావడంలేదు! సుశీలకు చెప్పింది సంతోషంగా. ఇప్పుడు రోజుకెంత మిగులుతోందో లెక్కవేసి, ఓ నెల మిగులు బడ్జెట్‌తో తనకు ప్రజెంటేషన్ ఇచ్చుకోమంది సుశీల.

మరి కొన్నాళ్ళు గడిచేసరికి, కళ్యాణిలో మొదట కలిగిన సంతోషం ఇగిరిపోయింది.

ఆ స్థానంలో ఏదో వెలితి కనిపించసాగింది. అడుక్కునేవాళ్ళెవరూ తన ఇంటివైపు రావడం లేదంటే తనలో అన్నపూర్ణత్వం ఎండిపోయినట్లు అనిపిస్తోంది. ఇట్లావుంటుందని తనకు ఇంతకుముందు తెలీదు. మరి సుశీల కిట్లా అనిపించడం లేదా? అదే అడిగింది.

"అసలు దాన ధర్మాలు చెయ్యాలనుకోవడమే తప్పు. ఏదో పుణ్యమొస్తుందన్నది అందుక్కారణం. అంటే, నీకు పుణ్యం రావడానికి వీళ్ళంతా ఇట్లా దీనంగా, హీనంగా అడుక్కుంటూ వుండాలన్న మాట./ఇతర దేశాల్లో అడుక్కునే వాళ్ళుండరంట. కారణం అక్కడ 'పుణ్యం' లేదు గనుక. పుణ్యముంటే పాపమూ వుంటుంది. పుణ్యం నీదైతే, పాపం వాళ్ళది! తప్పుగదా?"

"కానీ నేను పుణ్యం కావాలనుకోవడం లేదు. పాపం, పుణ్యం లేకపోతే పోనీ, మానవత్వం వుందిగా. అడుక్కునే వాళ్ళు రాకపోతే, కొంచెం ప్రశాంతంగా సుఖంగా వుండొచ్చునను కున్నాను. అది తప్పనీ సాధ్యం కాదనీ తెలిసింది. మనశ్శాంతి మన సుఖమూ మనకు మాత్రమే సంబంధించినవి కావనీ, అవి అందరికీ వుంటే మనకూ వుంటాయనీ, అందరికీ లేకపోతే మనకూ వుండవనీ.... అర్థమయింది. కనుక, నీ గురువు గారికీ నీకూ ఇవాల్టి నుంచీ టాటా!"

"నీ ఖర్మ" అంది సుశీల.

*(1971 ఆగస్టు 'ఆంధ్రప్రభ' వారపత్రికలో ప్రచురితం)*

## -- కథ గురించి. . .

ఈ కథలో చెప్పిన కామాక్షయ్యే యీ కథ పుట్టడానికి ముఖ్యకారకుడు. ఇంటిపేరు మాత్రం ఈ కథలో చెప్పింది కాదు. ఆయన ఇంటి పేరేమిటో తెలీదు. 1950 ప్రాంతంలో నేను ప్రొద్దుటూర్లో వుండిన మా అక్క వద్ద వుంటూ, అక్కడి మునిసిపల్ హైస్కూల్లో చదువుతున్నప్పుడు, మా ప్రక్కింట్లో వుండిన కామాక్షయ్యను చూశాను. వాళ్ళింటి ముందున్న వసారాలో కూర్చుని, యీ కథలో చెప్పిన 'ట్రిక్'ని ఉపయోగించి, రోజూ బిచ్చగాళ్ళని పంపిస్తూ వుండడం చూసి, మేం నవ్వుకునే వాళ్ళం. అయితే ఆ యుక్తి మార్గం ఆయన ప్రత్యేకించి పరిశోధించి కనుగొన్నదా, లేక అనాలోచితంగా జరుగుతూ వచ్చిందా అనేది తెలీదు.

నిజానికి కథలో వున్న పరిస్థితి చాలా విషాదకరమైనది. దీన్ని, ఆ విధంగా రాయకుండా తమాషాధోరణిలో రాయడానికి కారణం కూడా తెలీదు. బహుశా, కథ ద్వారా ఏం చెప్పాలా అన్న ఆలోచన అప్పటికి నేను చేయలేకపోవడం అయినా కావాలి. లేదా కామాక్షయ్య కామెడీ ధోరణిలో కథనడిపించడమైనా కావాలి. 1950 దశాబ్దంలో రాయలసీమలో భయంకరమైన కరువొచ్చింది. దాన్ని 'గంజి కరువు' అన్నారు. దిగువ మధ్య తరగతికి చెందిన వాళ్ళు కూడా గంజి కేంద్రాలకు వెళ్ళ వలసి వచ్చింది. ఎటుచూసినా, ఏ వేళ చూసినా బిచ్చగాళ్ళే కనిపించేవాళ్ళు. కామాక్షయ్య ప్రత్యక్ష ప్రభావంతో పాటు, కరువు పరోక్ష ప్రభావం నాపైన బలంగా పనిచేసి వుండాలి.

కథ తమాషాధోరణిలో వున్నా, ఆ తమాషాలో బరువు కూడా వున్నట్టు అర్థమవుతుందనీ, జీవితంలో ప్రశాంతి అనేది ఎట్లా సాధ్యమవుతుందో కథ సూచనగానైనా చెప్పగలిగిందనీ.... అనుకోవడం వల్ల యీ కథని ఇప్పటి పాఠకులముందుకు తెస్తున్నాను.